# రవి అస్తమించిన సామ్రాజ్యం

"ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం? నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం" అన్నాడు మహాకవి శ్రీశ్రీ.

ఆ పరపీడన పరాయణత్వం చేసిన "పరు"లలో, కొన్ని శతాబ్దాలుగా మొట్టమొదటి బెంచీలో కూర్చున్నది కొద్ది దేశాలవారు మాత్రమే. వాళ్ళల్లో సుప్రసిద్ధులు బ్రిటన్ స్పెయిన్ పోర్చుగీస్ ఫ్రాన్స్ దేశాలు. వీళ్ళల్లో అందరికన్నా గొప్ప వాళ్ళు బ్రిటిష్‌వారు. రవి అస్తమించని సామ్రాజ్యం అని డంబాలు పలికిన ఆ నాటి గ్రేట్ బ్రిటన్, ఆనాడూ ఈనాడూ ఎలావుందో చూద్దాం.

ఇంత చిన్న దేశం, ప్రపంచంలో దాదాపు మూడు వంతులు, దురాక్రమణ చేసి, ఆ దేశాల ఆస్తులు కొల్లగొట్టి, శతాబ్దాల తరబడి వాళ్ళని తన కాలి క్రింద తొక్కిపెట్టి పరిపాలించిందంటే నాకెంతో ఆశ్చర్యంగా వుండేది. నాకేకాదు, ఆ దేశ చరిత్ర కాస్త తెలుసుకున్న ఎవరికైనా వింతగానే వుంటుంది. అందుకనే ఈ వ్యాసం కోసం ఎన్నో చరిత్ర పుస్తకాలు తిరగదోడితే తెలిసిందిది.

రెండు వేల సంవత్సరాల ఆ దేశచరిత్రని చకచకా తెలుసుకుందాం. అంతే కాదు, ఈ వ్యాసంలో ముఖ్యోద్దేశం, ఎలాటి దేశం ఎలా అయిందో చూపిద్దామని మాత్రమే. నాకేమీ ఈనాటి ఇంగ్లాండ్ మీద పెద్ద దురుద్దేశం లేదు.

స్టోన్ హెంజ్ స్థూపాల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే, ఇక్కడ వున్న పురాతనులు కంచుయుగానికి చెందినవారని. క్రీస్తుపూర్వం ఐదో శతాబ్దంలో సెల్‌టిక్ ఆక్రమణదారులు ఆనాటి బ్రిటన్‌లో పాదం పెట్టారుట. క్రీ.శ. 43 సంవత్సరంలో, క్లాడియస్ 1 అనే రోమన్ చక్రవర్తి అక్కడ జెండా పాతేశాడు. ఆ సామ్రాజ్యం నాలుగు శతాబ్దాల తర్వాత చప్పబడింది. ఆంగ్లో శాక్సన్స్, జూట్స్ అనే జర్మానిక్ తెగ నెమ్మదిగా అక్కడికి చేరి, చిన్న చిన్న రాజ్యాలు ప్రారంభించారుట. ఎనిమిదో శతాబ్దం వచ్చేసరికీ, వైకింగుల దురాక్రమణ మొదలయి, అది 1016కల్లా డేన్‌కన్యూట్ పరిపాలనలో ఇంగ్లాండ్‌ని పూర్తిగా ఆక్రమించింది. 1066లో నార్మన్ విలియమ్ 1 పరిపాలనతో అక్కడ మొట్టమొదటిసారిగా జమీందారీ పద్ధతి (ఫ్యూడలిజం) మొదలయింది. రాజులకీ జమీందార్లకీమధ్య గొడవలు రావటం, పదవీ వ్యామోహాలు పెరిగిపోవటంతో, 1215లో మాగ్నాకార్టా రాజ్యాంగం వ్రాయబడింది. 1337లో ఫ్రాన్స్‌తో మొదలయిన వందేళ్ళయుద్ధం 1348లో వచ్చిన ప్లేగ్ వ్యాధి చావులతో, ఈజమీందారీ పద్ధతి సన్నబడింది. 1485లో ట్యూడర్‌ల యుగంలో ఇంగ్లండ్ పునరుద్ధరణ జరిగింది. 1509–47 ల మధ్యలో ఎనిమిదవ హెన్రీ హయాంలో, చర్చ్ ఆఫ్ ఇంగ్లాడ్‌కూడా స్థాపించబడింది. మొదటి ఎలిజబెత్ రాణి కాలంలో, ఇంగ్లండ్ పునరుద్ధరణే కాకుండా చుట్టుపక్కల దేశాల దురాక్రమణలూ జరిగాయి. తర్వాత పార్లమెంటుకీ రాజుల మధ్య పదవీ కలహాలు పెరిగిపో

యి సివిల్ వార్ (1642-48) రావటం, 1649లో మొదటి ఛార్ల్స్‌ని పైకి పంపించేసి రాజ్యాల్ని నిషేధించటం, కామన్‌వెల్త్‌ని స్థాపించటం, రెండవ ఛార్ల్స్ కాలంలో మళ్ళీ రాజుల పరిపాలన రావటం, ఇలా ఇలా.. ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం?

అలా మొదలయిన బ్రిటిష్ సామ్రాజ్యం, చాప కింద నీరులా నెమ్మదిగా పాకుతూ వ్యాపారం పేరుతో ప్రపంచంలో మూడువంతులు ఆక్రమించింది. కెనడా అమెరికా వెస్ట్ ఇండీస్ ఆఫ్రికా ఖండంలో ఎంతో భాగాన్ని ఇండియా ఉపఖండాన్ని పూర్తిగానూ, ఆసియాలో ఎన్నో దేశాలనీ ఆక్రమించింది. ఆ దేశాలన్నిటినీ కొల్ల గొట్టింది.

తర్వాత ఒక్కొక్క దేశం చేతిలోనూ రకరకాలుగా దెబ్బతిని, 1970కి ఆర్థికంగా చితికిపోయింది. ఎనభైలలో నార్త్ సీ లో ఆయిల్ కనపడటంతో మళ్ళీ ఆర్థికంగా పుంజుకుంది, రవి అస్తమించిన బ్రిటిష్ సామ్రాజ్యం.

గత మూడు సంవత్సరాల్లోనూ బిజినెస్ పనిమీద మూడు నాలుగుసార్లు ఇంగ్లాండ్ వెళ్ళాను. ఏ మాటకామాటే చెప్పుకోవాలి, ఇంగ్లాండ్ చాల సుందరమైన దేశం. యుద్ధాలతోనూ, ఆక్రమణలలోనూ ఏమీ గర్వకారణం కనపడక పోయినా, అంత చితికిపోయినా, ఈనాటికీ ఇంకా ఆర్థికంగా ఎన్నో దేశాలకి ముందుగానే వుంది. ఈ వ్యాసం బ్రిటిష్ సామ్రాజ్యం గురించి కనుక, ఇంగ్లండ్ గురించీ, లండన్ గురించీ ఇంకోసారి వివరంగా చెప్పుకుందాం.

"సుందరంగా ఎందుకుండదూ! అన్ని దేశాలనీ దోచేసిందంతా ఏమవుతుంది మరి" అంటాడు మా సుబ్బారావ్. కోహినూర్ వజ్రాన్ని మన ప్రభుత్వం మరిచి పోయినా, అతను మరిచిపోలేదు మరి.

నాకు ఇంగ్లాండ్‌లో బాగా నచ్చింది, మన ఇండియన్ భోజనం. మనవాళ్ళ రెస్టారెంట్లలోనే కాకుండా మిగతా రెస్టారెంట్లలో కూడా మన కర్రీ పలావ్ నాన్ దొరుకుతాయి. ఇంగ్లాండ్స్ నేషనల్ ఫుడ్ కర్రీ అని గర్వంగా చెప్పుకుంటారు. అందుకని అదొక గర్వకారణం!

థేమ్స్ నది ఒడ్డున నడుస్తుంటే అడిగాడు నాతో వచ్చిన జఫ్ "ఇక్కడెక్కడో లండన్ బ్రిడ్జ్ వుండాలి కదూ" అని.

లీసా నవ్వి "ఏం... లండన్ బ్రిడ్జిస్ ఫాలింగ్ డౌన్... పాట గుర్తొచ్చిందా... లండన్ బ్రిడ్జ్ ఇప్పుడు అమెరికాలో ఆరిజోనాలో వుంది. వీళ్ళ దగ్గర మనవాళ్ళు కొనుక్కొని, అక్కడికి తీసుకువెళ్ళారు. పేపర్లలో చూడలేదా" అంది.

మార్గరెట్ థాచార్ కాలంలో బ్రిటన్ అమెరికాకి ఎంతో దగ్గరయింది. అమెరికాలోని పరదేశ పెట్టుబడులలో, ఇంగ్లాడిప్పుడు ప్రథమ స్థానంలో వుంది. పారిశ్రామికంగా ఎంతో ముందున్న ఇంగ్లాడ్‌లోని భారీ పరిశ్రమలు, సాంకేతిక పరిశ్రమలూ విదేశీయుల చేతుల్లో వున్నాయి. జాగ్వార్ కారు కంపెనీని ఫోర్డూ రోల్స్ రాయిస్ కంపెనీని బిఎమ్‌డబ్ల్యూ కొన్నాయి. ప్రస్థుతం పూర్తి ఇంగ్లాండ్ కార్లు మార్కెట్లో లేనట్టే. అలాగే పూర్తిగా ఇంగ్లాండ్‌దే అయిన ప్రపంచ ప్రసిద్ధ కన్స్యూమర్

ఎలక్ట్రానిక్స్ కంపెనీ, చిప్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ, కంప్యూటర్ కంపెనీ, కెమేరా కంపెనీ కానీ ఇప్పుడు లేనే లేవు. అమెరికా, జపాన్, జర్మనీ లాటి దేశాలు అక్కడ కంపెనీలని కొనటమో, తామే స్థాపించి నడపటమో చేస్తున్నాయి.

"స్వంతదారులెవరయితేనేం దేశంలో పెట్టుబడి పెడుతున్నారు ఉద్యోగాలు ఇప్పిస్తున్నారు, ఆర్థికంగా దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారు"అనే సర్దుబాటుకి వచ్చింది ఈనాటి ఇంగ్లాండ్.

నా చిన్నప్పుడు క్రికెట్‌లో, టెన్నిస్‌లో ఇంగ్లాండ్ ప్రధమస్థానంలో వుండేది. మరి ఈనాడు? అవికూడా చరిత్రలో మరుగున పడిపోయాయేమో!

మా ట్రిప్‌లో షేక్స్పియర్ పుట్టిన ప్రదేశం వార్‌విక్‌షైర్, సర్ కానన్ డాయల్, బర్నార్డ్ షా లండన్‌లో రచనలు చేసిన చోట్లూ చూస్తుంటే, నాలోని సాహితీ ప్రియుడు ఎగిరి గంతులు వేశాడు.

ఏది కొనాలనుకున్నా, అక్కడ ఎంతో ఖరీదు.

"ఆస్టిన్ వెళ్ళాక అక్కడ కొనుక్కుందాంలే! నేనుమాత్రం మా ఆయనకో స్కాచ్ బాటిల్ కొంటాను. అంతే!" అంది లీసా.

అమెరికాలో 60 నిమిషాలు అనే ఒక న్యూస్ షో వుంది. ఆ షో చివర, ఆండీ రూనీ ఒక ప్రఖ్యాత కామెంటేటర్, రెండు నిమిషాలు ఒక్కొక్క విషయం మీద నిర్మొహమాటంగా ఒక్కొక్కర్నిదులిపేస్తుంటాడు. చాలమంది ఆ షో చూసినా చూడకపోయినా, ఆయన కోసం చివరి రెండు నిమిషాలూ తప్పకుండా చూస్తారు. ఆయన ఒకసారి, ఇగ్లాండ్ రాణివాసం మీద విరుచుకు పడ్డాడు.

"జీవితంలో ఒక్కరోజు కూడా పనిచేయరు వాళ్ళు. జనాన్ని దోచుకోవటం తప్ప ఇంకేమీ తెలీదు. గవర్నమెంటు వాళ్ళని మేపుతుంటుంది పోనీ ఆ రాజులకీ, రాణులకీ, జీవితంలో ఏమైనా మంచి విలువలున్నాయా అంటే అవీ లేవు. ప్రతి వాళ్ళకీ ఒక్కొక్క స్కాండల్. అంత నాగరిక దేశమై వుండీ వీళ్ళకి ఎందుకంత డబ్బూ, మర్యాదా ఇస్తారో నాకర్థం కాదు. ఈ రోజుల్లో కూడా రాచరికాలేమిటి" అన్నాడు. అది ఆయన స్వంత అభిప్రాయమే అయినా, ఆ కామెంటరీని పొగుడుతూ, అమెరికానించే కాక ఇంగ్లాండ్ కెనడాలనించీ కూడా ఉత్తరాలు వచ్చాయి.

అమెరికన్ మీడియా- పేపర్లు కానీండి, టీవీ కానీండి- నిజాల్ని నిర్మొహమాటంగా బయటపెడుతుంది. ఎడిటర్లకీ పబ్లిషర్లకీ ఆ ధైర్యమూ వుంది, స్వాతంత్రమూ వుంది. దానికి ప్రజల సహకారం ఎంతోవుంది. గవర్నమెంటూ అడ్డురాదు. ఎక్కడా సెన్సారులు కనపడరు. నిక్సన్ ప్రభుత్వాన్ని కిందకి దించిందీ, క్లింటన్ మోనికా కథలని బయటకు తీసుకువచ్చిందీ ఈ మీడియానే. అది రచయితగా నాకు అమెరికాలో బాగా నచ్చిన విషయం. ఈ విషయం గురించి ఇంకోసారి తీరిగ్గా చెప్పుకుందాం.

ఈసారికి, ఇదీ రవి అస్తమించిన సామ్రాజ్యం కథ.

* * *